ప్రజాశక్తి

శనివారం 26, నవంబర్ 2022 | 5 | అనంతపురం



సచివాలయ వ్యవస్థతో గ్రామ స్వరాజ్యం

మంత్రి ఉషశ్రీచరణ్

కుందుర్పి : సిఎం జగన్ సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టి గ్రామ స్వరాజ్యాన్ని తీసుకొచ్చారనిమంత్రి కెవి ఉషశ్రీచరణ్ అన్నారు. గురువారం మండలంలోని కరిగానపల్లి గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామపంచాయతీలో సచివాలయం ఏర్పాటు చేయడం రాజకీయ ప్రమేయం లేకుండా నేరుగా సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు వివరించారు. అవినీతి రహితంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి రాధాస్వామి, ఎంపిటిసి లలితమ్మ, కన్వీనర్ సత్యనారాయణశాస్త్రి, ఎంపిపి కమల నాగరాజు, వైస్ ఎంపిపి సోమనాథ్, సింగిల్‌విండో ఛైర్మన్ వన్నూర్‌రెడ్డి, మాజీ సర్పంచి తిప్పేస్వామి, కురుబ సంఘం మండల అధ్యక్షులు గోపాల్, ఎంపిడిఒ నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రికి సుస్తీ..!



హిందూపురం పట్టణంలోని జిల్లా ప్రభుత్వ అసుపత్రి

హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రి అనారోగ్యంతో బాధపడుతోంది. శ్రీ సత్యసాయి జిల్లాలో జిల్లా స్థాయి హోదా కల్గిన అసుపత్రి ఇదొక్కటే. ఈ అసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం జరిగి ఏడాది కావస్తోంది. ఈ ఆసుపత్రికి జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. సమావేశం నెల నెలా నిర్వహించి ఆసుపత్రి అభివృద్ధికి సంబంధించి తగిన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. ఏడాదైనా సమావేశం జరగకపోవడంతో అసుపత్రి అభివృద్ధి ఎక్కడవేసిన గొంగళి అక్కడనే అన్న చందంగా మారింది. గత మెడికల్ సూపరిండెంటెంట్ ఆసుపత్రి అభివృద్ధి సమావేశానికి కలెక్టరును ఆహ్వానించినట్లు సమాచారం. అయితే ఆఫీసు ద్వారా సమావేశానికి సంబంధించిన లెటర్ పంపాలని కలెక్టర్ సూచించినట్లు తెలుస్తోంది. కానీ హిందూపురం జిల్లా అసుపత్రిలో ఈ ఆఫీసు లేకపోవడంతో కలెక్టర్‌కు సమాచారం ఇవ్వడంలేదని సిబ్బంది చెబుతుండడం గమనార్హం.

ప్రజాశక్తి-హిందూపురం

ఆరోగ్య సంజీవనిగా ఉన్న హిందూపురం జిల్లా అసుపత్రిలో సమస్యలు విలయతాండవం చేస్తున్నాయి. ప్రస్తుతం డెంగీ, విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. సరిపడా పడకలు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. వైద్యులు, సిబ్బంది కొరత ఉంది. సమయపాలనా సరిగా పాటించడం లేదు. అసుపత్రిలో మందుల కొరత షరామామూలే. స్కానింగ్ కోసం ప్రత్యేక వైద్య నిపుణులు లేకపోవడంతో గర్భిణులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ప్రజాశక్తిలో వచ్చిన కథనానికి స్పందించి స్థానిక ఎమ్మెల్సీ రూ.5 లక్షలు ఇచ్చారు. వారం రోజుల క్రితం రూ.12.50 లక్షలు వెచ్చించి వైద్యులు సూచించిన మందులను కొనుగోలు చేసి అందించారు. వీటిని సక్రమంగా

ఏడాదైనా నిర్వహించని అభివృద్ధి కమిటీ సమావేశం

ఆసుపత్రి వైపు కన్నెత్తి చూడని కలెక్టర్

వినియోగిస్తున్నారా ? లేదా ? అసుపత్రిలో నెలకున్న సమస్యలు ఏంటి ? తదితర వాటిపై ప్రతి నెల అభివృద్ధి కమిటీ సమావేశంలో చర్చించాల్సి ఉంది. అయితే సమావేశాలు జరగకపోవడంతో సమస్యలను పరిష్కరించే నాధుడే కరువయ్యారు. కలెక్టర్ స్పందించి ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించాలని పుర ప్రజలు కోరుతున్నారు.

మాతాశిశు అసుపత్రికి పురిటినొప్పులు..

ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన మాతాశిశు అసుపత్రిలో పూర్తిస్థాయి సిబ్బంది లేక పురిటి నొప్పులు పడుతోంది. ఐదుగురు గైనకాలజిస్టులకు గాను కేవలం ఇద్దరే ఉన్నారు. వైద్యులపై పని ఒత్తిడి ఎక్కువవుతోంది. దీంతో కాన్పు కోసం వెళ్తే మరో ఆస్పత్రికి రెఫర్ చేస్తున్నారు. ఇక్కడ కాన్పుల సంఖ్య కన్నా రెఫర్‌ల సంఖ్య ఎక్కువగా ఉంటోంది. జిల్లా ఆస్పత్రిలో గైనకాలజిస్టుల కొరత ఉండడంతో కాన్పుల కోసం వచ్చే గర్భిణులు ఇబ్బంది పడుతున్నారు. కాన్పు కోసం అనంతపురం, లేదా ప్రయివేటు ఆస్పత్రులకు వెళ్లాల్సిన పరిస్థితి. వెంటనే గైనకాలజిస్టులను నియమించే దిశగా కలెక్టర్ చర్యలు తీసుకోవాలి.

మరమ్మతులో ఆల్ట్రా, సిటీ స్కాన్ మెషిన్లు..

అసుపత్రిలో సిటీ స్కాన్ యంత్రం మరమ్మతుకు గురయి ఏడాది గడుస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఆస్పత్రిని సందర్శించే ప్రజాప్రతినిదులు వెంటనే నూతన సిటీ స్కాన్ యంత్రం తెప్పిస్తామని చెబుతున్నారు. అయితే యంత్రం మాత్రం రావడం లేదు. కడుపు నొప్పికి తీయాల్సిన అల్ట్రా సౌండ్ స్కాన్ మిషన్ అందుబాటు ఉన్నప్పటికీ సంబందిత వైద్య నిపుణులు లేకపోవడంతో నిరుపయోగంగా ఉంది. అసుపత్రికి వచ్చే రోగులు రూ.వేలు ఖర్చుచేసి బయట స్కానింగ్ చేయించుకోవాల్సిన పరిస్థితి.

సమయపాలన ఏదీ..?

రోగులకు సేవలు అందించడంలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న వైద్యులే కీలకం. కొంత మంది డ్యూటీలు ఎగ్గొట్టి ప్రయివేటు సేవల్లో మునిగిపోతున్నారు. క్యాజువాల్టీ వంటి అత్యవసర సేవలకు డ్యూటీలో ఉన్న డాక్టర్లు డుమ్మా కొడుతున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆసుపత్రిలో తప్పక ఉండాలి. కానీ ఉదయం 9, 10 గంటలకు బయోమెట్రిక్ వేసి మధ్యాహ్నం 12 గంటలకే సొంత క్లినిక్‌లు, బయటి ఆసుపత్రులకు వెళ్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.



మానవహారం నిర్వహిస్తున్న ఐద్వా, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

మహిళలపై దాడులను అరికట్టాలి

ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వరి

ప్రజాశక్తి-గుంతకల్లు

దేశవ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న దాడులను, అత్యాచారాలను, హత్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అరికట్టాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వరి డిమాండ్ చేశారు. శుక్రవారం ఐద్వా పట్టణ మహిళా సంఘం, ఎస్ఎఫ్ఐ సంఘాల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా హింస వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పొట్టి శ్రీరాములు కూడలిలో వంద మంది మహిళలతో మానవహారం చేపట్టారు. మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అయ్యాయని నిరసన నినాదాలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వరి మాట్లాడుతూ...ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ముగ్గురు మహిళల్లో ఒకరు హింసకు గురవుతున్నారన్నారు. ప్రతి ఏటా మహిళలపై హింస పెరుగుతూ ఉందన్నారు. సగటున రోజుకు 86 అత్యాచారాలు, గంటకు 49 నేరాలు మహిళలపై జరుగుతున్నాయన్నారు. ప్రతి 77 నిమిషాలకు ఒక వరకట్న హత్య జరుగుతోందన్నారు. ప్రతి 48 నిమిషాలకు ఒక దళిత మహిళ అత్యాచారానికి గురవుతోందని అన్నారు. వాటిని అరికట్టకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. మహిళలను సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా పురుషులతో సమాన అవకాశాలు కల్పించినప్పుడే అణిచి వేత అంతమవుతుందన్నారు. వైసిపి ప్రభుత్వం దిశ చట్టంతో 21 రోజుల్లోనే నేరస్తులకు శిక్షలు వేస్తామని ఆర్భాటం చేసిందన్నారు. ఐతే రాష్ట్ర ప్రభుత్వం దిశ చట్టం తెచ్చి రెండేళ్లు గడిచినా ఇప్పటికీ ఒక్క కేసూ నమోదు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వాలు ఇప్పటికైనా మహిళల రక్షణ చట్టాలను సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళలకు అన్ని రంగాల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పించి వారి ఎదుగుదలకు సహకారం అందించాలన్నారు. మహిళలకు సమానత్వం, సమాన వేతనం, నిర్భయ, దిశా చట్టాలను ప్రతిష్టాత్మక అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రంగమ్మ, జ్యోతి, ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి వెంకటేష్, నాయకులు కిశోర్, దివాన్ తదితరులు పాల్గొన్నారు.

ఉడికీ ఉడకని అన్నం తిని
25 మంది విద్యార్థులకు అస్వస్థత

మధ్యాహ్న భోజనం ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్

ప్రజాశక్తి-కదిరి టౌన్

ఉడికీ ఉడకని అన్నం తిని కదిరి పట్టణంలోని వీవర్స్ కాలనీ ఉన్న మున్సిపల్ ప్రైమరీ స్కూల్‌కు చెందిన 25 మంది విద్యార్థులు గురువారం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. పాఠశాలలో 146 మంది విద్యార్థులు ఉన్నారు. మధ్యాహ్నం భోజనం అనంతరం 25 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ప్రధానోపాధ్యాయురాలు లావణ్య హుటాహుటిన చికిత్స నిమిత్తం విద్యార్థులను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విద్యార్థుల తల్లిదండ్రుల వివరాల మేరకు.. విద్యార్థులకు మధ్యాహ్నం మాడిపోయిన, వాసన వస్తున్న భోజనం పెట్టారు. విద్యార్థులు అన్నం తినకుండా వదిలేశారు. గమనించిన ప్రధానోపాధ్యాయురాలు లావణ్య మళ్లీ మంచి భోజనం తయారుచేసి పిల్లలకు వడ్డించాలని మధ్యాహ్న భోజనం సిబ్బందికి సూచించారు. వారు ఆత్రంగా ఉడికీ ఉడకని అన్నం తయారుచేసి పిల్లలకు వడ్డించారు. ఆ భోజనం తిన్న విద్యార్థులు అరగంట తరువాత కడుపునొప్పి, కళ్లు తిరుగుతున్నాయంటూ వాంతి చేసుకున్నారు. ప్రధానోపాధ్యాయురాలు వారిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

విద్యార్థి సంఘాల నాయకుల పరామర్శ

విషయం తెలుసుకున్న ఎస్ఎఫ్ఐ, ఆర్ఎస్‌వైఎస్ విద్యార్థి సంఘాల నాయకులు ఆస్పత్రికి వెళ్లి విద్యార్థులను పరామర్శించారు. ఘటనకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు యశ్వంత్, విజయ్ కుమార్ మాట్లాడుతూ..అధికారులు, ఉపాధ్యాయుల నిర్లక్ష్యం కారణంగానే ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు నెలల క్రితం ఓబుళదేవురచెరువు మండలం మిట్టపల్లి గ్రామంలోని ప్రభుత్వ బీసీ హాస్టల్లో ఫుడ్ పాయిజన్ వల్ల విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారన్నారు. ఇప్పుడు మళ్లీ ఇలాంటి ఘటన చోటు చేసుకోవడం బాధాకరమన్నారు. ఈ సంఘటనకు కారణమైన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు బాబావలి, ఆర్ఎస్‌వైఎఫ్ అరుణ్‌కుమార్, భార్గవ్, కిషోర్, బబ్లూ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకుంటాం..

విద్యార్థులు అస్వస్థతకు గురికావడానికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని ఎంఇఒ చిన్నకృష్ణ చెప్పారు. ఆస్పత్రికి వెళ్లి ఆయన విద్యార్థులను పరామర్శించారు. డిఎంహెచ్ఒ ఎస్‌వి.కృష్ణారెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పిల్లలను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఉడికీ ఉడకని అన్నం తినడం వల్లే పిల్లలకు కడుపునొప్పి, వాంతులు అయ్యాయని తెలిపారు.



మాట్లాడుతున్న ఎన్నికల అబ్జర్వర్ మురళీధర్‌రెడ్డి

ఓటరు జాబితా సవరణలో

రాజకీయ పార్టీలను విశ్వాసంలోకి తీసుకోవాలి

ఎన్నికల అబ్జర్వర్ మురళీధర్ రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో రాజకీయ పార్టీలను విశ్వాసంలోకి తీసుకోవాలని ఎన్నికల అబ్జర్వర్ మురళీధర్‌రెడ్డి అధికారులకు ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో ఎన్నికల అబ్జర్వర్ మురళీధర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్‌లు అన్నికల అధికారులతో ప్రత్యేక ఓటరు సవరణ-2023 కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్జర్వర్ మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో కీలకమైన ఎన్నికల ప్రక్రియ ఓటర్ జాబితా తయారీతో ప్రారంభం అవుతుందన్నారు. అర్హులైన ప్రతి ఓటర్‌కూ ఓటు హక్కు కల్పించడం, డూప్లికేట్ ఓట్లను పూర్తి స్థాయిలో తొలగించడంతోనే 'ఒక వ్యక్తికి ఒకే ఓటు' అనే సిద్ధాంతానికి కట్టుబడినట్టవుతుందన్నారు. ఓటరు జాబితా తయారీ గురించి రాజకీయ పార్టీలకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలన్నారు. అధికారులతో తమ అభిప్రాయాలు పంచుకునేందుకు రాజకీయ పార్టీలకు అవకాశం కల్పించాలన్నారు. డూప్లికేట్ ఓట్ల తొలగింపు, ఆధార్-ఓటర్ కార్డు అనుసంధానం వంటి అంశాల్లో రాజకీయ పార్టీలు సహకరించాలన్నారు. ప్రతి పోలింగ్ బూతు స్థాయిలో పోలింగ్ ఏజెంట్లను నియమించుకుని అధికార యంత్రాంగానికి సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో గాయత్రీ దేవి, ఆన్‌సెట్ సీఈవో కేశవనాయుడు, డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి, జెడ్పీ సీఈవో భాస్కర్‌రెడ్డి, ఆర్డీవోలు మధుసూదన్, నిశాంత్ రెడ్డి, జె.రవీంద్ర, అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

రైతులు శాస్త్రవేత్తల సలహాలు పాటించాలి

బుక్కరాయసముద్రం ఎంపిపి సునీత

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

రైతులు శాస్త్రవేత్తలు, అధికారుల సూచనలు, సలహాలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని ఎంపిపి సునీత సూచించారు. శుక్రవారం మండలంలోని దయ్యాలకుంటపల్లిలో సర్పంచి సద్దా రమేష్ అధ్యక్షతన డాక్టర్ వైఎస్ఆర్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ రబీ సీజన్‌లో సాగుచేసిన వేరుశనగ పంటలో 14 వారాల పొలంబడి కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు విరివిగా పాల్గొని రైతుల సలహాలు, సూచనలు పాటించి సాగు చేయాలని సూచించారు. జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్ మాట్లాడుతూ రైతులందరూ క్రమం తప్పకుండా ప్రతి వారం పొలంబడి కార్యక్రమంలో పాల్గొని వేరుశనగ చుట్టూ రక్షక పంట, అంతర పంటగా అలసంద, ఎర పంటగా ఆముదం వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త రాధిక ఎంపిటిసి శివారెడ్డి, వెంకటాపురం సర్పంచి వసంత్‌కుమారు, రైతు శిక్షణా కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ మద్దిలేటి, ఎడిఎలు వెంకటరాముడు, పద్మలత, శైలజ, వ్యవసాయాధికారులు రుమనాబేగం, శ్రీనివాసులు, ప్రవీణ్, శాస్త్రవేత్తలు కిషోర్, వెంకటరమణ, ఆర్‌బికె సిబ్బంది, రైతులు, జన జాగృతి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు చంద్రమౌళి, నారాయణస్వామి, వ్యవసాయాధికారి శ్యాంసుందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపిపి సునీత

సమస్యలు పరిష్కరించకపోతే మెరుపు సమ్మె

కమిషనర్‌కు ఉద్యోగ, కార్మిక సంఘం నాయకుల వినతి

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే డిసెంబర్‌లో మెరుపు సమ్మె చేయాల్సి వస్తుందని మున్సిపల్ ఉద్యోగ, కార్మిక సంఘం నేతలు హెచ్చరించారు. ఈమేరకు మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎటిఎం నాగరాజు, ప్రధాన కార్యదర్శి నాగభూషణ ఆధ్వర్యంలో శుక్రవారం కమిషనర్ భాగ్యలక్ష్మిని కలిసి వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ మాట్లాడుతూ అనంతపురం నగరపాలక సంస్థ పారిశుధ్య విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులకు బకాయి వేతనాలు, హెల్త్ అలవెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రెగ్యులర్ కార్మికులకు బకాయి ఉన్న యూనిఫాం, కుట్టు కూళ్లు, చెప్పులు, కొబ్బరి నూనె, డిఎలు, ఇంక్రిమెంట్లు, రక్షణ పరికరాలు ఇవ్వాలన్నారు. కార్మికులకు మూడు ఖాతాల్లో ఉన్న ఈపీఎఫ్‌ను ఒకే ఖాతాలోకి జమ చేయాలని, చనిపోయిన ఔట్సోర్సింగ్ కార్మికులకు ఈపీఎఫ్ ద్వారా వచ్చే డెత్ బెనిఫిట్స్‌ను సంస్థ ద్వారానే ఇప్పించాలని, ఈఎస్ఐ కార్డుల్లో ఉన్న తప్పులను సవరించి కార్మికుల అందరికీ వైద్యం అందేలా చూడాలని, ఇంజనీరింగ్ కార్మికులకు స్కిల్డ్, సెమీస్కిల్డ్ వేతనాలు, హెల్త్ అలవెన్స్, రిస్కు అలవెన్స్ అమలు చేయాలని, 60 సంవత్సరాల పేరుతో తొలగించిన కార్మికుల కుటుంబ సభ్యులలో ఒకరికి ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు అనుబంధ మున్సిపల్ యూనియన్ నగర అధ్యక్షులు ఎర్రిస్వామి, కోశాధికారి తిరుమలేశు, సహాయ కార్యదర్శి బత్తల ఆదినారాయణ, జిల్లా మహిళా కన్వీనర్లు లక్ష్మీదేవి, లక్ష్మీనరసమ్మ, కమిటీ సభ్యుడు రాఘవేంద్రప్రసాద్, ఇంజనీరింగ్ సెక్షన్ మురళీ, సిఐటియు నగర ఓల్డ్, న్యూ టౌన్ అధ్యక్ష కార్యదర్శులు బాబు, వెంకటనారాయణ, ముర్తుజ, తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఉద్యోగ, కార్మిక సంఘం నాయకులు

వైసిపి నాయకుల డీజిల్ దందా

మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-బొమ్మనహాల్

కొంతమంది వైసిపి నాయకులు కర్నాటక నుంచి అక్రమంగా డీజిల్ తీసుకొస్తూ సరిహద్దుల్లో ప్రభుత్వ ఆదాయానికి గడి కొడుతున్నారని మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు ఆరోపించారు. శుక్రవారం మండలంలోని కళ్లుదేవనహళ్లి గ్రామ సమీపంలో ఉన్న పెట్రోల్ బంకును కాలవ శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరిహద్దులో ఉన్న కర్ణాటకలోని పెట్రోల్ బంకుల నుంచి అక్రమంగా డీజిల్‌ను ప్రభుత్వ ఆర్టీసీ డిపోలకు తరలించి లబ్ధి పొందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి గండి కొడుతున్న అధికార పార్టీ నాయకులపై ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో టిడిపి కన్వీనర్ బలరామిరెడ్డి, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేశవరెడ్డి, సొసైటీ మాజీ ప్రెసిడెంట్ కొత్తపల్లి మల్లికార్జున, కొత్తపల్లి తిమ్మరాజు, గోవిందవాడ మాజీ సర్పంచి దేవేంద్రప్ప, బోయ సుంకన్న, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ఆత్మకూరు : మండలంలోని యాలేరు గ్రామంలో ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, జిల్లా పరిషత్ ఛైర్పర్సన్ బోయ గిరిజమ్మ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వై.ఆంథోనిరెడ్డి, వై.లలిత రెడ్డి యాలేరులో రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి హేమలత, వైస్ ఎంపిపి నీలమ, సర్పంచ్ బాలగ్యారెడ్డి, మార్కెట్ యార్డు ఛైర్మన్ గోపాల్‌రెడ్డి, ధనంజయయాదవ్, క్రికెట్ సంఘం అధ్యక్షులు ప్రకాష్‌రెడ్డి, ఫణిరెడ్డి, వెంకట్రామిరెడ్డి, బుసిరెడ్డి ప్రశాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ యోగా పోటీలకు గుత్తి విద్యార్థి ఎంపిక



అఖిలసాయిరెడ్డి యోగాసనం

గుత్తి : పట్టణానికి చెందిన మాజీ సైనికుడు గోపీనాథ్ రెడ్డి, హేమలత దంపతులకు కుమారుడు అఖిల సాయిరెడ్డి జాతీయస్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యాడు. 4వ తరగతి చదువుతున్న అఖిల గుత్తిలోని ఆర్యే ఉచిత యోగా కేంద్రంలో శిక్షణ తీసుకున్నాడు. ఇటీవల అనకాపల్లి జిల్లా చోడవరంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని సాధించాడు. డిసెంబర్ 26, 27, 28 తేదీల్లో పుదుచ్చేరిలో జరిగే పోటీల్లో అఖిల పాల్గొంటారని అనంతపురం జిల్లా యోగా సంఘం అధ్యక్షురాలు లక్ష్మీదేవి, ఆర్యే ఉచిత యోగా కేంద్రం నిర్వాహకులు రామకృష్ణారావు, కృష్ణ తెలిపారు. విద్యార్థి ఎంపిక పట్ల తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు అభినందించారు. జాతీయస్థాయి పోటీల్లో అత్యంత ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు.

విద్యలో ప్రతిభ కనబరచాలి

బెలుగుప్ప : విద్యార్థులు విద్యలో ప్రతిభ కనబరిచి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని గాలిమర్ల సుజలాన్ కంపెనీ ఇన్‌ఛార్జి ఎస్.కిరణ్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో గాలిమర్ల సుజలాన్ కంపెనీ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రికెట్, ఫుట్‌బాల్, క్యారంబోర్డులు తదితర ఆట వస్తువులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సుజలాన్ కంపెనీ సూపర్‌వైజర్ శివారెడ్డి, వెంకటరమణ, రామకృష్ణ, ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు మహేష్, షరీఫ్, విద్యార్థులు పాల్గొన్నారు.

సున్నా వడ్డీ రైతుల జాబితా విడుదల

గార్లదిన్నె : మండలంలో లక్షలోపు రుణం తీసుకున్న రైతులకు 2021–2022 ఖరీఫ్‌నకు సంబంధించి సున్నా వడ్డీకి ఎంపికైన రైతుల వివరాలను విడుదల చేసినట్లు మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సున్నా వడ్డీకి అర్హులైన రైతులకు నవంబర్ 29న సిఎం జగన్ ఖాతాల్లో సున్నా వడ్డీ మొత్తాన్ని జమ చేస్తారన్నారు. పంట రుణం తీసుకుని సంవత్సరంలోపు చెల్లించిన రైతులు సున్నా వడ్డీకి అర్హులన్నారు. సంబంధిత వివరాలను ఆర్‌బికె కేంద్రాల్లో ప్రదర్శించినట్లు తెలిపారు.

వాహనాల వేలంపాట

పెద్దవడుగూరు : పలుకేసుల్లో పట్టుబడిన ద్విచక్ర వాహనాలకు శుక్రవారం స్థానిక పోలీసుస్టేషన్ ఆవరణలో వేలంపాట నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సెబ్ అడిషనల్ ఎస్పీ ధనుంజయులు, ఎస్ఐ రాజశేఖరెడ్డి, ఏఎస్సైలు నారాయణనాయక్, మధు, జమేదారు మోహన్ తదితరులు హాజరై 21 వాహనాలకు వేలంపాట నిర్వహించగా రూ.3,83,500 నగదు వచ్చినట్లు ఎస్ఐ తెలిపారు.

బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోండి

కళ్యాణదుర్గం : యునియన్ బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని మేనేజర్ శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం బ్యాంకు ప్రాంగణంలో బ్యాంకు సేవలపై ఖాతాదారులతో అవగాహన కల్పించారు. ఈసందర్భంగా డిజిఎం హరిమోహన్‌సాహు, అనంతపురం రిజియన్ హెడ్ సింహాచలం హాజరై యూనియన్ బ్యాంకు కల్పిస్తున్న సేవలను వివరించారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీజీఎం హరిమోహన్‌సాహు

శాశ్వత భూహక్కు పత్రాలు పంపిణీ

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

ప్రతి హక్కుదారుడికీ జగనన్న శాశ్వత భూహక్కు పత్రాలు అందుతాయని మంత్రి ఉషశ్రీచరణ్ అన్నారు. శుక్రవారం మండలంలోని బోయలపల్లిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రైతులకు భూహక్కు పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా రాష్ట్రంలోని అన్ని భూములను అధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రీ సర్వే చేయించి హక్కు పత్రాలు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఆర్డీఓ నిశాంత్‌రెడ్డి, రెవెన్యూ అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కణేకల్లు : వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంతో వివాదాస్పద భూముల సమస్యలు పరిష్కారం అవుతున్నాయని విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని సొల్లాపురం గ్రామంలో జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష పథకం కింద రైతులకు భూహక్కు పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలు, కులమతాలకు అతీతంగా భూముల రీసర్వే చేస్తున్నట్లు తెలిపారు. సరిహద్దు రాళ్ళు, తక్కువ కొలతలు తదితర సమస్యలతో అన్నదమ్ముల మధ్య గొడవలు, పొరుగు రైతులతో గొడవలు ఉండేవన్నారు. ఈ గొడవల్లో ఎంతోమంది ప్రాణాలు సైతం పోగొట్టుకున్నారన్నారు. సమస్యను తెలుసుకున్న సిఎం జగన్ రీసర్వేను తీసుకొచ్చి రైతులకు ఉపశమనం కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో సొల్లాపురం సర్పంచి కాపు మహేశ్వరి, తహశీల్దార్ రజాక్‌వలి, సీనియర్ అసిస్టెంట్ గోవింద్‌రెడ్డి, ఎంపిడిఒ శ్రీనివాసులు, ఇఒఆర్‌డి గుడేన్న, రూరల్ బ్యాంక్ అధ్యక్షులు తిమ్మప్ప, రైతుసంఘం జయచంద్రారెడ్డి, శోభలింగారెడ్డి, శివరాంరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, జగన్నాథ్‌రెడ్డి, హుస్సేన్‌పీరా, నాగేపల్లి, రసూల్, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : కొలతలు సరిగాలేని రైతుల పొలాలను ప్రభుత్వం సమగ్ర భూసర్వే కింద కొలతలు వేసి నెంబర్ రాళ్లను పాతించి భూహక్కు కల్పించిందని ఆర్డీవో రవీంద్ర అన్నారు. శుక్రవారం మండలంలోని విరుపాపురంలో శుక్రవారం వైఎస్ఆర్ జగనన్న సమగ్ర భూరక్షణ పథకంలో భాగంగా రైతులకు భూహక్కు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు పైసా ఖర్చు లేకుండా ప్రభుత్వమే వివాదంలో ఉన్న భూములను కొలతలు వేసి రైతులకు అప్పగించే బాధ్యత తీసుకుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి శ్రీదేవి, సర్పంచి సలోమి, జడ్పిటిసి భాస్కర్‌రెడ్డి, తహశీల్దార్ ఈరమ్మ, సర్వే శాఖ డిఐ నాగరాజు, సర్వేయర్ అయేషా, ఆర్ఎస్ఐ షేక్షావలి, రెవెన్యూ, సచివాలయ కార్యదర్శులు ప్రసాద్, రాఘవేంద్ర, అశోక్, మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీచరణ్

నీటి పన్ను బకాయిలు వసూలు చేయాలి

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ భాగ్యలక్ష్మి

నగరంలో పెండింగ్‌లో ఉన్న రూ.13 కోట్ల నీటి పన్ను బకాయిలు వెంటనే వసూలు చేయాలని కమిషనర్ భాగ్యలక్ష్మి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం నగరపాలక సంస్థలోని మీటింగ్ హాల్‌లో ఇంజినీర్లు, అమెనిటీస్ కార్యదర్శులు, నీటి విభాగం ఫిట్లర్లు, రెవెన్యూ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ గత సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు అక్రమ కొళాయి కనెక్షన్లపై ఏమేరకు చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. ఇందుకు అక్రమ కనెక్షన్లు తొలిగించామని అధికారులు తెలపగా మరి ఎందుకు అక్రమ కనెక్షన్లు వస్తున్నాయని ప్రశ్నించారు. సంస్థకు ద్రోహం చేస్తూ అక్రమాలకు పాల్పడే వారిపై క్రమశిక్షణ చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అదేవిధంగా గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చినసమస్యల పరిష్కారానికి నగరానికి రూ.6 కోట్ల నిధులు వచ్చామన్నారు. ఈ నిధులతో ఇప్పటికే పనులు ప్రారంభించినట్లు తెలిపారు. వాటిని అధికారులు నిత్యం పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. ఈ సమావేశంలో నగరపాలక ఎస్ఇ నాగమోహన్, అదనపు కమిషనర్ రమణారెడ్డి, అర్ఓ.సతీష్ కుమార్, ఆర్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి పోతుల నాగరాజు

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎన్నికల ప్రచారం

రాయదుర్గం : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల పిడిఎఫ్ అభ్యర్థులు పోతుల నాగరాజు, కత్తి నరసింహారెడ్డి శుక్రవారం పట్టణంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణంలోని కోటలో ఉన్న కాళికాంబ ఆలయ సముదాయ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ పట్టభద్రులు, ఉద్యోగులు తప్పకుండా మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు నాగమణి, సహాయ కార్యదర్శి బి.మల్లికార్జున, సిపిఐ రాయదుర్గం తాలూకా కార్యదర్శి నాగార్జున, సిపిఎం నాయకులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

డిజిపిని కలిసిన నాన్ కేడర్ ఎస్పీ జె.రామ్మోహనరావు

అనంతపురం కలెక్టరేట్ : జిల్లా సెబ్ అదనపు ఎస్పీగా ఉంటూ నాన్ కేడర్ ఎస్పీగా పదోన్నతి పొంది ఎసిబికి బదిలీ అయిన జె.రాంమోహనరావు శుక్రవారం మంగళగిరిలో రాష్ట్ర డిజిపి కెవి.రాజేంద్రనాథ్‌రెడ్డి, అదనపు డిజిపి రవిశంకర్ అయ్యన్నార్‌లను రేంజ్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

27న ఆవాజ్ జిల్లా మహాసభలు

అనంతపురం కలెక్టరేట్ : ఆవాజ్ జిల్లా 2వ మహాసభలను ఈనెల 27న వికె హాల్‌లో నిర్వహించనున్నట్లు ఆవాజ్ జిల్లా కార్యదర్శి ముస్కిన్ తెలిపారు. సదస్సులో దేశంలో రాష్ట్రంలో ముస్లిం మైనార్టీలపై జరుగుతున్న దాడులు, లవ్ జిహాద్, ఈజాబ్, ఆజా పేరుతో హిందూ ముస్లిం మధ్య రేపుతున్న చిచ్చులపై చర్చించనున్నట్లు తెలిపారు. అలాగే ముస్లింల సంక్షేమ పథకాలు అమలు కోసం పోరాట కార్యచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. సదస్సులో ముస్లిం మైనార్టీలు లౌకికవాదులు ప్రజాతంత్రవాదులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ నగర కమిటీల అధ్యక్ష కార్యదర్శులు మసూద్, ఇర్ఫాన్, వలి, ఇస్మాయిల్, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగం పట్ల అవగాహన పెంచుకోవాలి

గుంతకల్లు : భారత రాజ్యాంగం పట్ల విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సమితి జాతీయ కార్యదర్శి, రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బిఎస్ కృష్ణారెడ్డి అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా శుక్రవారం పట్టణంలోని శ్రీసాయి మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు రాజ్యాంగంపై అవగాహన సదస్సు నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో రోజురోజుకూ పెరుగుతున్న సమస్యల పరిష్కారానికి రాజ్యాంగంలో ఉండే చట్టాలు మాత్రమే పరిష్కారం చూపుతాయన్నారు. చట్టం అందరికీ సమానమే అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ జి.ప్రభాకర్, భారత రాజ్యాంగ అవగాహన వేదిక సమన్వయకర్త ఎ.చంద్రశేఖర్, సీనియర్ సభ్యులు చౌక్కా సునీల్, పంపావతి, జింకల వేణుగోపాల్, రామకృష్ణ, జింకల సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-గుంతకల్లు



కరపత్రాలు విడుదల చేస్తున్న ఆవాజ్ నాయకులు

జిల్లాకేంద్రంలో ఈనెల 27, 28వ తేదీల్లో నిర్వహించనున్న ఆవాజ్ జిల్లా 2వ మహాసభలను జయప్రదం చేయాలని సంఘం పట్టణ అధ్యక్షుడు అబ్దుల్లా పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని మోదీనాబాద్ మసీదు దగ్గర ఇందుకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆవాజ్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్లా, షబ్బీర్ మాట్లాడుతూ ముస్లిం, మైనార్టీల మౌలిక హక్కుల సాధనకై ఆవాజ్ కమిటీ మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రధానంగా బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి హిందూ, ముస్లిం మతాల మధ్య చిచ్చు పెడుతూ దాడులు చేయిస్తోందన్నారు. అంతేగాకుండా కేంద్రప్రభుత్వం ఎన్ఆర్సీ, ఎన్పీఆర్, సిఎఎ లాంటి బిల్లులను తీసుకొచ్చి మైనార్టీలను ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం సైతం ముస్లింలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, వక్ఫ్‌బోర్డ్ ఆస్తులకు సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి రక్షణ కల్పించి వాటి ఆదాయాన్ని ముస్లింల అభివృద్ధికికి వినియోగించాలన్నారు. అదేవిధంగా మైనార్టీలపై జరుగుతున్న దాడులను అరికట్టాలన్నారు. ఆయా సమస్యలపై జిల్లా మహాసభల్లో చర్చించి పరిష్కరించేందుకు చర్చించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ పట్టణ సహాయ కార్యదర్శి మస్తాన్, మోదీనాబాద్, ఆవాజ్ నాయకులు అయూబ్, తదితరులు పాల్గొన్నారు.

పిల్లల్లో పెరుగుతున్న ఊబకాయం

ప్రజాశక్తి-అనంతపురం

గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ మనోజ్‌కుమార్



దేశాన్ని పట్టిపీడిస్తున్న అనారోగ్య సమస్యల్లో ఊబకాయం ప్రధాన సమస్యగా మారింది. ముఖ్యంగా చిన్నారుల్లో ఈ సమస్య అధికం అవుందని ప్రముఖ గ్రాస్టో ఎంటరాలజిస్టు మనోజ్‌కుమార్ అన్నారు. ప్రపంచ ఊబకాయ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రజాశక్తితో మాట్లాడుతూ దాదాపు 14.4 మిలియన్ల స్థూలకాయ పిల్లలతో భారతదేశం ప్రపంచంలోనే 2వ స్థానంలో ఉందన్నారు. చిన్నారుల్లో ఆహారపు అలవాట్ల వల్లే ఈ సమస్య వస్తోందని నివేదికలు చెబుతున్నాయన్నారు. గతంతో పోలిస్తే 10 రెట్లు ఎక్కువగా పెరిగిందన్నారు. పిల్లలు బయట ఆటలకు దూరంగా ఉండటం, శారీరక శ్రమ లేకపోవడం, జీవనశైలి, కొవ్వు అధికంగా ఉండే ఆహారం తీసుకోవటం శరీరంలో కొవ్వు పేరుకుపోవడానికి ప్రధాన కారణాలుగా మారాయన్నారు. ఊబకాయం పిల్లల్లో శారీరక, మానసిక, సామాజిక శ్రేయస్సుకు ప్రతికూలంగా ప్రభావితం చేస్తుందన్నారు. అంతేగాకుండా ఊబకాయంతో బాధపడే చిన్నారులకు టైప్ 2 డయాబెటిస్ హైపర్ టెన్షన్, కొలెస్ట్రాల్ సమస్య వచ్చే ప్రమాదం ఉందన్నారు. కావున చిన్నారుల్లో ఊబకాయం సమస్యకు ప్రధాన కారణమైన ఆహారపు అలవాట్లను తల్లిదండ్రులు మొదటి నుంచి నియంత్రించాల్సిన అవసరం ఉందన్నారు.

శింగనమల ఎస్ఐ దిలీప్‌కుమార్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్ఐ దిలీప్‌కుమార్

శింగనమల : మండల నూతన ఎస్సైగా దిలీప్‌కుమార్ మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్ఐ సాగర్ గార్లదిన్నెకు బదిలీ కావడంతో కనేకల్లులో మండలంలో విధులు నిర్వహిస్తున్న ఎస్సై దిలీప్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలవ్యాప్తంగా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

చుక్కలూరులో ఫ్రైడే డ్రైడే


ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్



నీటి తొట్లను శుభ్రం చేయిస్తున్న వైద్యాధికారులు

మండలంలోని చుక్కలూరు గ్రామంలో శుక్రవారం ఫ్రైడే –డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా జిల్లా మలేరియా వైద్యాధికారి డి.ఓబులు ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి సమక్షంలో ఇళ్ల పరిసరాల్లో పాడైపోయిన, ఉపయోగించని వస్తువుల్లో నిల్వ ఉన్న నీటిని తొలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి ల్యాబ్ రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ మలేరియా అసిస్టెంట్ ఆఫీసర్ సత్యనారాయణ, తాడిపత్రి సబ్ యూనిట్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి గ్రామోత్సవానికి విరాళం



ఆర్థికసాయం అందజేస్తున్న దండు శ్రీనివాసులు

శింగనమల : మండల కేంద్రంలో నిర్వహించనున్న అయ్యప్పస్వామి గ్రామోత్సవానికి తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు శుక్రవారం రూ.10వేలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయ్యప్పస్వామి గ్రామోత్సవానికి విరాళం ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. అయ్యప్ప స్వామి ఆశీస్సులు అందరికీ కలగాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి కుళ్లాయప్ప, నాయకులు ఎం.ఆదినారాయణ, నారాయణస్వామి, బ్యాళ్ల సుదర్శన్, అయ్యప్పస్వామి భక్తులు, టిడిపి కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునేలా ప్రోత్సహించాలి

పుట్లూరు : మండలంలో అర్హులైన హౌసింగ్ లబ్ధిదారులను గుర్తించి ఇళ్లు నిర్మించుకునే విధంగా ప్రోత్సహించాలని హౌసింగ్ డిఇ శ్రీమన్నారాయణ సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ యోగానందరెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో డిఇ మాట్లాడుతూ మండలానికి సంబంధించి 1688కి ఇళ్ల పట్టాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. వీరందరూ ఇళ్లు నిర్మించుకునే అవగాహన కల్పించాలన్నారు. ఇప్పటికే ప్రధానమంత్రి యోజన కింద నిర్మిస్తున్న వారితోపాటు మిగతా వారికి కూడా ఎందుకు అవకాశం కల్పించామో చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ మల్లేష్‌ప్రసాద్, హౌసింగ్ ఇఎ లోకేష్, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సబ్సిడీ స్ప్రింక్లర్లు పంపిణీ

కుందుర్పి : మండలంలోని యర్రగుంట గ్రామంలో రైతులకు శుక్రవారం సబ్సిడీపై మంజూరైన స్ప్రింక్లర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సింగిల్‌విండో ఛైర్మన్ వన్నూర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 8మంది రైతులకు ఒక యూనిట్ కాస్ట్ రూ.18 వేలతో ఒకొక్క రైతుకు 41 పైపులు, 8 స్ప్రింక్లర్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

మానవతా విలువలపై సదస్సు

పుట్లూరు : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో మానవతా విలువలపై శుక్రవారం చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యక్తిత్వ వికాస నిపుణులు స్వర్ణలత విద్యార్థి దశ నుంచే ఎవరితో ఎలా ఉండాలి.. ఏవిధంగా మాట్లాడాలనే విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

నేరాలు ఘోరాలు



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నరసింగప్ప

నకిలీ పోలీసు అరెస్టు

రూ.2.2 లక్షల నగదు స్వాధీనం

గుంతకల్లు : వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానని ఆశ చూపి నిరుద్యోగులతో రూ.లక్షలు వసూలు చేసి కుచ్చుటోపీ పెట్టిన నకిలీ పోలీసును స్పెషల్ టీమ్ సిబ్బంది శుక్రవారం కొనకొండ్ల రోడ్డులో అరెస్టు చేసినట్లు డీఎస్పీ నరసింగప్ప తెలిపారు. శుక్రవారం రెండవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కర్నూలు జిల్లా మద్దికెర గ్రామానికి చెందిన వీరన్న కుమారుడు బండారు పృథ్వీ అలియాస్ చింటూ, హర్షరెడ్డి, రాజేష్‌రెడ్డి పేర్లతో చలామణి అవుతూ కడప రిమ్స్ మెడికల్ కళాశాలలో ఎఫ్ఎన్ఓగా పని చేస్తున్నాడు. జల్సాలకు అలవాటు పడిన అతడు 2016 నుంచి మెడికల్ డిపార్ట్మెంట్‌లో డాక్టర్, పోలీసు శాఖలో కానిస్టేబుల్ గాను పని చేస్తున్నట్లు నిరుద్యోగులను నమ్మించి కడప, హైదరాబాద్, వరంగల్, అనంతపురం జిల్లాలో ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానని సుమారు రూ.50 లక్షలు వసూలు చేసి మోసం చేశాడు. ఈనేపథ్యంలో బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్సై నరేంద్ర, ఎఎస్సై రామకృష్ణారెడ్డి, హెచ్ఎస్ ఓబుళపతి, పిసిలు బాబు, దాదాఖలందర్‌తో ప్రత్యేక టీమ్ ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. ఈసమయంలో శుక్రవారం మధ్యాహ్నం స్థానిక కొనకొండ్ల రోడ్డులో బైక్‌పై వెళ్తున్న చింటూను పోలీసులు గుర్తించి అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితుడి వద్ద ఉన్న పోలీసు యూనిఫాం, బూట్లు, గుర్తింపు కార్డులు, బైకులు, రూ.2.05 లక్షలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. నిందితున్ని కోర్టులో హాజరుపరుచనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఒకటి, రెండవ పట్టణ సిఐలు రామసుబ్బయ్య, గణేష్, ఎస్సై నరేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

గీజర్‌లో మంటలు వ్యాపించి ఇద్దరికి గాయాలు

నార్పల : మండల కేంద్రంలో గీజర్‌కి గ్యాస్ సిలిండర్ మారుస్తుండగా మంటలు వ్యాపించి నార్పలకు చెందిన ఖాజీ ఫయాజ్ బాషా, షేక్షావలికి శుక్రవారం గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే... స్థానిక కోటవీధిలో నివాసం ఉండే ఖాజీ ఫయాజ్ ఇంట్లోని మరుగుదొడ్డిలో ఉన్న గ్యాస్ గీజర్‌ను తన స్నేహితుడు షేక్షావలితో కలిసి సిలిండర్ మారుస్తుండగా ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. దీంతో తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే స్థానికులు, బంధువులు స్పందించి నార్పల వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 ద్వారా అనంతపురం సర్వజన వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ వెంకటప్రసాద్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించాలి

సాఫ్ట్‌బాల్ సిఇఒ వెంకటేశులు

రాప్తాడు : సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ జాతీయ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ పేరు వినపడేలా క్రీడాకారులు రాణించాలని సాఫ్ట్‌బాల్ సిఇఒ వెంకటేశులు పిలుపునిచ్చారు. శుక్రవారం కర్నూలులోని మాంటిస్సోరి పాఠశాలలో సాఫ్ట్‌బాల్ క్రీడాకారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలు కర్నూలులో నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. మాంటిస్సోరి స్కూల్ ప్రిన్సిపల్ రమాజ్యోతి మాట్లాడుతూ మాంటిస్సోరి పాఠశాల యాజమాన్యం క్రీడలను ప్రోత్సహించడంలో ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సాఫ్ట్‌బాల్ ప్రధాన కార్యదర్శి ఎల్ఆర్ మౌర్య, ట్రెజరర్ శ్రీకాంత్, జాయింట్ సెక్రటరీ శోభన్‌బాబు, టోర్నమెంట్ ఆర్గనైజర్ జాకీర్‌హుస్సేన్, కార్యదర్శులు నాగేంద్ర, విజయ్, వ్యాయామ ఉపాధ్యాయులు కుబేర్, కేశవమూర్తి, గోపాల్‌రెడ్డి, చంద్ర, కోచ్‌లు సాయి, అశోక్, బద్రీ, జగదీష్, మహేష్, సింహాద్రి, లక్ష్మీ, కళ్యాణ్, లోకేష్, రేణుక పాల్గొన్నారు.

వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

శింగనమల : నియోజకవర్గవ్యాప్తంగా అధిక వర్షాలతో నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారం ఇవ్వాలని మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ మాసూలు చంద్రమోహన్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అధిక వర్షాలతో వేరుశనగ, పత్తి, ఆముదం, జొన్న, మొక్కజొన్న, ఉద్యాన పంటలు పూర్తిగా పంటలు నష్టపోయాయన్నారు. ఆఖరికి పెట్టిన పెట్టుబడులు కూడా రాలేదన్నారు. దీంతో ప్రయివేట్ వ్యక్తుల వద్ద అప్పులు తీసుకొచ్చిన రైతులు వడ్డీలు కట్టలేక అల్లాడుతున్నారన్నారు. ఇప్పటికైనా నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25వేలు, కాయగూరలు, పండ్ల తోటలకు ఎకరాకు రూ.50వేలు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

క్షయ నివారణకు కృషి

అనంతపురం : క్షయా వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా క్షయవ్యాధి నివారణా అధికారి డాక్టర్ అనుపమ జేమ్స్ పిలుపునిచ్చారు. ప్రధాన మంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నగరంలోని క్షయ వ్యాధి నివారణ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అనుపమ జేమ్స్ మాట్లాడుతూ కొప్పుల మీనాక్షమ్మ ట్రస్టు రవికాంత్ రమణ, వారిమిత్రులు దేవేంద్ర రెడ్డి, శ్రీనివాసులు సహకారంతో 25 మంది క్షయా వ్యాధిగ్రస్తులను ఆరునెలల పాటు దత్తత తీసుకుని పౌష్టికాహారం అందివ్వనున్నట్లు తెలిపారు. ఇంకా దాతలు ఎవరైనా ఉంటే ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్షయా వ్యాధి కార్యాలయ సిబ్బంది నాగసురేష్, శ్రీధర్‌బాబు, శ్రావణి, శ్రీనివాసరెడ్డి, మహేష్, మహేశ్వరి, రేవతి, వెంకటేష్, జయవర్ధన్‌రెడ్డి, సుమన్, సూర్యనారాయణ, ఖాదర్, అంజి, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌పై అవగాహన పెంచుకోవాలి

అనంతపురం : నగరంలోని రుద్రంపేట బైపాస్‌లో ఉన్న శ్రీచైతన్య ఏటీపీ–10, అనంతపురం రూరల్ పాములరాయిలో ఉన్న శ్రీచైతన్య పాఠశాలల్లో ట్రాఫిక్‌పై అవగాహన కల్పిస్తూ విద్యార్థులతో కలిసి శుక్రవారం ర్యాలీలు నిర్వహించారు. ఆయా ర్యాలీలను శ్రీచైతన్య పాఠశాలల ఎజిఎం సుబ్బారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఇందులో భాగంగా విద్యార్థులు బ్రహ్మ, శివుడు, యముడు, చిత్రగుప్తుని వేషధారణలతో విద్యార్థులు ప్రజలకు కళ్లకు కట్టినట్లుగా వివరించారు. అలాగే హెల్మెట్ పెట్టుకున్న వారికి, సీటు బెల్టు పెట్టుకున్న వారికి గులాబీ పూలు ఇచ్చి అభినందించారు. అంతేకాకుండా హెల్మెట్ లేని ద్విచక్ర వాహనాలను ఆపి హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనాల్లో వెళ్లే వారికి సీట్ బెల్ట్ పెట్టుకోవాలని లేదంటే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీదేవి, డీన్ సతీష్, సరిత, జోనల్ పిఈటి విజయ్‌కృష్ణన్, పీటీ శివప్రసాద్, డాన్స్ మాస్టర్ విష్ణు, డ్రాయింగ్ మాస్టర్ మధుకర్, ఉపాధ్యాయుల బందం పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి

గుత్తి : ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదవాలని మున్సిపల్ కమిషనర్ బివి. నరసారెడ్డి సూచిం చారు. శుక్రవారం స్థానిక పట్టణంలోని కోట ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ బీసీ బాలుర వసతి గహంలో ప్రభుత్వం సరఫరా చేసిన దుప్పట్లను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. వసతి గృహాల్లో సౌకర్యాలను కల్పిస్తోందని చెప్పారు. పథకాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో వార్డెన్ ఖాదర్ హుస్సేన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు అవగాహన సదస్సు

పుట్లూరు : మండల పరిధిలోని అన్ని సచివాలయాల్లో మహిళా పోలీసులు, హెల్త్ అసిస్టెంట్లు, గ్రామసంఘం యానిమేటర్లు, అంగన్‌వాడీలు, వెలుగు కార్యాలయంలో లింగవివక్ష, మహిళా చట్టాలు, స్త్రీశిశు సంక్షేమంపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ యోగానందరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్, పోలీస్ అధికారులు, మండల విద్యాధికారి, మండల వైద్యాధికారి, విస్తరణాధికారి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు, ఎపిఎం, తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు.